సాక్షి చిత్తూరు

ఆదివారం । 11 । ఆగస్టు । 2024



19 నాటుబాంబుల స్వాధీనం

అడవి పందులను వేటాడేందుకు తయారు చేసిన 19 నాటుబాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



భవిష్య నిధి ఏదీ?

జెడ్పీ ఉద్యోగుల భవిష్య నిధి ఖాతా లెక్కలు అగమ్యగోచరంగా మారడంతో ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. - 8లో



హోరాహోరీగా..

వి.కోటలో ప్రారంభమైన అంతర జిల్లా షూటింగ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

జేసీ ఆకస్మిక బదిలీ



శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులును ఆకస్మికంగా బదిలీ చేసింది. ఆయన్ను గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈయన గత ఏడాది ఏప్రిల్ 15వ తేదీన జాయింట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఏడాదికి పైగా జిల్లాలో విధులు నిర్వర్తించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో చిత్తూరు అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు. డీసీసీబీ, సీడీఎంఎస్, రెస్కో శాఖలకు పర్సన్ ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను బదిలీ చేశారు. ఆ బదిలీల్లో జేసీ శ్రీనివాసులను బదిలీ చేయకుండా అదే స్థానంలో కొనసాగించారు. జిల్లాలోని కొంత మంది కూటమి ఎమ్మెల్యేలు సైతం ఆయన్ను కొనసాగించాలని సూచించారు. అయితే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేసింది. ఆయన రెండు రోజుల్లో జేసీ విధుల నుంచి రిలీవ్ కానున్నారు. జిల్లాకు నూతన జాయింట్ కలెక్టర్‌ను ప్రభుత్వం ఇంకా నియమించలేదు.

పీఎఫ్ ఖాతాల లెక్క తేల్చాలి

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగ, ఉపాధ్యాయ పీఎఫ్ ఖాతాల్లో జమకాని కోట్లాది రూపాయాల లెక్క తేల్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, బోడె మోహన్‌యాదవ్ అన్నారు. ఆ సంఘ నాయకులు శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ జీతాల నుంచి ప్రతి నెల మినహాయిస్తున్న పీఎఫ్ నగదు ఖాతాలకు సరిగ్గా జమకావడం లేదన్నారు. ఇందులో ఉన్న మతలబు ఏమిటో ప్రభుత్వం తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో పీఎఫ్ స్లిప్పులు అందుబాటులో లేకపోవడంతో ఎవరి ఖాతాల్లో ఎంత మొత్తం ఉందో తెలియడం లేదన్నారు. రుణాలు పొందాలన్నా, ఉద్యోగ విరమణ పొందే వారు తుది మొత్తాలు పొందాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు చెప్పారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న జెడ్పీ కార్యాలయం ఎదుట మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.

జాతీయ స్థాయి వర్క్‌షాప్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం మురకంబట్టులోని అపోలో కాలేజీలో శనివారం ఏపీ ప్రొఫెషనల్ సోషల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ప్రతిపాదన రచనపై వర్క్‌షాప్ నిర్వహించారు. నర్సింగ్, మెడికల్, పబ్లిక్ హెల్త్, లైఫ్ సైన్సెస్, మహిళలు అభివృద్ధి, సాంఘిక శాస్త్రం వంటి విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు. వారికి అపోలో యూనివర్సిటీ ఉపకులపతి వినోద్ భట్ వర్క్‌షాప్ ఉద్దేశాన్ని వివరించారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం



సబ్‌స్టేషన్ పరిశీలనలో ఎస్ఈ


చిత్తూరు కార్పొరేషన్: నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్ర నాయుడు తెలిపారు. స్థానిక అర్బన్ ఈఈ కార్యాలయంలోని శనివారం సబ్‌స్టేషన్‌ను పరిశీలించి అధికారులతో సమావేశమయ్యారు. ఉమ్మడి జిల్లాలో 430 సబ్‌స్టేషన్లు ఉండగా, అందులో 215 సబ్‌స్టేషన్ల మరమ్మతు పనులు చేశామన్నారు. ప్రతి బుధవారం నిర్వహిస్తున్న విద్యుత్ గ్రీవెన్స్‌లో వస్తున్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించామన్నారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ విద్యుత్ సరఫరా అంశం పరిశీలనలో ఉందని చెప్పారు. కుప్పం నియోజకవర్గానికి 6 సబ్‌స్టేషన్లు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, డీఈ శేషాద్రి, ఏఈ బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ముందు అధికారం కోసం కూటమి ప్రభుత్వం అడ్డగోలు హామీలన్నీ ప్రజల ముందు కుమ్మరించింది. తీరా అధికారం వచ్చాక ఖజానా ఖాళీ అయిపోయిందంటూ చేతులెత్తేసింది. ఆఖరికి పేదల ఆకలి తీర్చే రేషన్ సరుకులకూ కోత పెట్టింది. ఇంటింటికీ సరుకులు అందించే వ్యవస్థకు మంగళం పాడేసింది. కేవలం టీడీపీ నాయకుల జేబులు నింపడానికి డీలర్ల కడుపు కొడుతోంది. వారితో బలవంతంగా రాజీనామాలు చేయించి, ఆ దుకాణాలను తెలుగు తమ్ముళ్ల పరం చేస్తోంది. అవకాశం వచ్చిన ప్రతి చోటా దోచుకోవడానికి ప్రయత్నిస్తోంది. అధికారం చేపట్టిన ఈ రెండు నెలల్లోనే ఇసుకతో మొదలు పెట్టి రేషన్ వరకూ ఇష్టానుసారంగా దోచేస్తోంది.



బాబు తీరు.. చౌకబారు

- రేషన్ సరుకులూ లేవు.. ఇంటింటికీ రావు
- డోర్ డెలివరీ వ్యవస్థ రద్దుకు సర్కారు యత్నం
- బలవంతంగా డీలర్లతో రాజీనామాలు
- తమ్ముళ్లకే లబ్ధి చేకూర్చేలా ప్రయత్నాలు
- కార్డుదారులకు మళ్లీ మొదలైన అవస్థలు



కోతలు ఇలా...

టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రేషన్ దుకాణంలో బియ్యం మాత్రమే అందిస్తోంది. కందిపప్పు, చక్కెరకు కోతలు పెట్టింది. దీనికి తోడు రేషన్ పంపిణీ వాహనాలను నిలిపివేయించారు. దీంతో చాలా వాహనాలు ఎండీయూ ఆపరేటర్ల ఇంటి వద్ద కాపలాకాస్తున్నాయి. పూర్తి స్థాయిలో వాహనాలను నిలిపివేసేందుకు టీడీపీ ప్రభుత్వం సమాయత్తమైంది. దీంతో జిల్లా వ్యాప్తంగా 336 కుటుంబాలు రోడ్డున పడనున్నాయి.

తమ్ముళ్లకు మేలు చేకూర్చేలా...

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రేషన్ షాపులను దక్కించుకునేందుకు పలువురు టీడీపీ నేతలు కుట్రలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అధికారులను గుప్పిట్లో పెట్టుకుని ప్రస్తుతం ఉన్న డీలర్లను తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా డీలర్లను తొలగించి అధికార పార్టీ నేతలు తమ కార్యకర్తలకు ఇచ్చుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారులు కూడా టీడీపీకి తల వంచడంతో, డీలర్లకు ఫోన్ చేసి బెదిరింపులకు తెగబడుతున్నారు. ఈ వేధింపులు తట్టుకోలేక కొందరు డీలర్లు స్వచ్ఛందంగా తమ షాపులు వదిలేసుకున్నారు. మరికొందరు డీలర్లకు సంబంధించిన సంతకాలను ఫోర్జరీ చేసి రాజీనామా చేసేందుకు సంసిద్ధమయ్యారు. ఇలా తమ్ముళ్లే రేషన్ డీలర్లుగా మారేందుకు కుట్రలు చేస్తున్నారు.

కాణిపాకం: రేషన్ డోర్ డెలివరీపై కూటమి ప్రభుత్వం కత్తెర పెట్టింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చి, ప్రజా పంపిణీ వ్యవస్థను పకడ్బందీగా అమలు చేసింది. పల్లె, పట్టణ ప్రాంతాల్లో చౌకదుకాణాల వద్దకు కార్డుదారులు పరుగులు తీయకుండా ఇళ్ల వద్దకే (ఎండీఏ వాహనాల ద్వారా) సరఫరా చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు మళ్లీ అప్పటి టీడీపీ పాలనలో కష్టాలే వచ్చాయి. ఈ నెల రేషన్ పంపిణీలో ఎక్కడా ఎండీఏ వాహనాలు కదలిన దాఖలాలు లేవు. ఈ వ్యవస్థను పూర్తిగా మట్టుపెట్టేందుకు టీడీపీ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. తమ్ముళ్లకు లబ్ధిచేకూర్చేలా ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. దీంతో లబ్ధిదారులు చౌక దుకాణం వద్దకే వెళ్లి బియ్యం, పప్పులు తెచ్చుకునే పరిస్థితి కనిపిస్తోంది...

గత ఐదేళ్ల కాలంలో రేషన్ సరుకులు ఇంటికి వచ్చేవి. అడగకుండానే కందిపప్పు, పంచదార, గోధుమ పిండి వంటి నిత్యావసర సరుకులు ఇచ్చేవారు. ఇక ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అడ్డూ అదుపూ లేకుండా హామీలు గుప్పించింది. కందిపప్పు, గోధుమలు, చక్కెరతో పాటు పలు రకాల సరుకులను రాయితీకి అందిస్తామని ప్రగల్బాలు పలికింది. తీరా అధికారంలో వచ్చాక వాటిని ఎగ్గొట్టడానికి సవాలక్ష వంకలు చెప్పింది. పేదలకు అందాల్సిన కందిపప్పు, గోధుమలు, చక్కెరకు మంగళం పలికింది. ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే వ్యవస్థను రద్దు చేసేందుకు చర్యలు చేపట్టింది. జిల్లాలో 5.43 లక్షల కార్డుదారులున్నారు. ఇంటింటికీ సరుకులు చేర్చేందుకు 336 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. వీటి ద్వారా కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయగా ప్రతి నెలా 15 వేల టన్నుల బియ్యం, 534 టన్నులు కందిపప్పు, 300 టన్నుల రాగులు, 270 టన్నుల చక్కెర, గోధుమపిండి 250 టన్నుల వరకు పంపిణీ చేస్తున్నారు. అయితే టీడీపీ ప్రభుత్వం వచ్చాక రేషన్‌లో కోతలు మొదలయ్యాయి.

జగనన్న హయాంలో పారదర్శకం



2014–19వరకు టీడీపీ హయాంలో రేషన్‌లో అక్రమాలు జోరందుకున్నాయి. అప్పట్లో కొందరు డీలర్లు సరుకుల్లో కోతలు పెట్టి పేదల కడుపులు కొట్టేవారు. తూకాల్లో మోసం చేసి పేదలను దోచుకునేవారు. గోనె సంచులు, డబ్బాలు పెట్టి బియ్యం కొలిచి కార్డుదారులకు కోతలు పెట్టేవారు. ఇతర సరుకులను బ్లాక్ మార్కెట్‌లోకి తరలించి సొమ్ము చేసుకునేవారు. కానుకల పేరుతో వచ్చే సరుకులను కూడా అమ్ముకునేవారు. ఈ రకంగా దోపిడీ చేసి కొందరు డీలర్లు జేబులు నింపుకునేవాళ్లు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అక్రమాలకు కళ్లెం వేస్తూ వచ్చింది. రేషన్ పంపిణీలో కొత్త సంస్కరణలు తీసుకొచ్చింది. తొలుత పారదర్శకతకు పెద్దపీట వేసింది. పేద ప్రజలకు పక్కాగా రేషన్ అందేలా చర్యలు చేపట్టింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇంటింటికీ రేషన్ విధానాన్ని తీసుకొచ్చింది. తద్వారా వాహనాలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు రేషన్ ఇచ్చేవి. సుదూర ప్రాంత వాసులు, అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఇంటింటికీ రేషన్ నుంచి ఉపశమనం లభించింది. ఇబ్బందులు లేకుండా ఇంటికే రేషన్ చేరేది. ప్రధానంగా వృద్ధులకు రేషన్ ఇబ్బందులు తొలగిపోయాయి. దీనికి కూటమి ప్రభుత్వం గండికొట్టింది.

జిల్లాలోని నియోజకవర్గాల వారీగా వాహనాలు, రైస్‌కార్డుల వివరాలు

నియోజకవర్గం పేరు	వాహనాల సంఖ్య	రైస్‌కార్డుల సంఖ్య
చిత్తూరు	40	64,840
పూతలపట్టు	52	90,210
జీడీనెల్లూరు	52	89,563
పలమనేరు	61	99,576
కుప్పం	54	83,853
పుంగనూరు	48	79,256
నగరి	29	35,904

“

కష్టాలు మళ్లీ మొదలు



రెండు కిలోమీటర్ల దూరంలోని ఎగువ గుబులవారి పల్లి రేషన్ షాప్‌కు కాలి నడకన వెళ్లి రేషన్ తీసుకోవాలి. ఎప్పుడు ఇస్తారో తెలియక చాలాసార్లు తిరగాల్సి వచ్చేది. గత ప్రభుత్వంలో రేషన్ వాహనం ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేయడంతో అవస్థలు తప్పాయి. ఇప్పుడు మళ్లీ రేషన్ షాప్ నుంచి తెచ్చుకోవాలంట. ఇక మళ్లీ కష్టాలు మొదలయ్యాయి.

– అక్కమ్మ, దిగువ గుబులవారిపల్లె, ఐరాల

చాలా కష్టంగా ఉంటుంది



ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేసే కార్యక్రమం ఒక్కసారిగా నిలిపితే చాలా కష్టంగా ఉంటుంది. గత ప్రభుత్వంలో గ్రామాల్లో రేషన్ సరుకులు వాహనాల ద్వారా ఇంటి దగ్గరికి వచ్చి ఇస్తా ఉన్నారు. దీంతో నడక యాతన కష్టాలు తప్పాయి. సులువుగా ఇంటిదగ్గర తీసుకుంటా ఉన్నాం. ఇప్పుడు ఆ పద్ధతి నిలిపివేస్తామంటున్నారు. దీంతో మళ్లీ మాకు ఇబ్బందులు తప్పదు.

– సరోజ, పూతలపట్టు

ఇంటింటికీ రేషన్ కొనసాగించాలి



ఇంటి వద్దకే రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాలి. గత ప్రభుత్వంలో ఇంటికే ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం కూడా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని నిలిపివేసేందుకు కుట్రలు చేస్తోంది. దీంతో రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులు పడిగాపులు పడాల్సి వస్తుంది. ఇకనైనా ఇబ్బందులు లేకుండా రేషన్ పంపిణీ చేయాలి.

– మునీంద్ర, మొగిలి మిట్టూరు, బంగారుపాళెం మండలం

జిల్లాలోని రేషన్ సరుకుల వివరాలు



జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్ల సంఖ్య	మొత్తం కార్డుల సంఖ్య
14	5,43,202
రేషన్ దుకాణాల సంఖ్య	**ఎండీయూ వాహనాల సంఖ్య**
1,339	336

గత ప్రభుత్వంలో నెలవారీగా జిల్లాకు రేషన్ సరఫరా 15 వేల మెట్రిక్ టన్నులు

చక్కెర	కందిపప్పు
270 టన్నులు	534 టన్నులు
రాగులు	**గోధుమ పిండి**
300 టన్నులు	250 టన్నులు



రవాణా దూరాన్ని బట్టి ఇసుక ధరలు



సుమిత్ కుమార్ గాంధీ కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నూతన ఇసుక విధానం అమలులో రవాణా దూరాన్ని బట్టి రేట్లను నిర్ణయించినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో చిత్తూరు రూరల్‌లోని దిగువమాసపల్లి, పాలూరు ఇసుక స్టాక్ యార్డుల నుంచి ఇసుకను రవాణా చేయనున్నట్లు చెప్పారు. ట్రాక్టర్, టిప్పర్ యజమానులు నిర్ణయించిన ధరలను మాత్రమే స్వీకరించాలని తెలిపారు. నిబంధనలను అతిక్రమించి ప్రజల నుంచి అధిక ధరలను వసూలు చేస్తే సంబంధిత వాహన యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిర్ణయించిన ఇసుక ధరలు

- 0–10 కి.మీల వరకు ట్రాక్టరు ఇసుక (5 టన్నులు) యార్డు వద్ద రూ.775, రవాణా చార్జీ రూ.1,200 మొత్తం రూ.1,975, టిప్పర్ ఇసుక (6 టైర్స్, 10 టన్నులు) యార్డు వద్ద రూ.1,550, రవాణాచార్జీ రూ.1,600 మొత్తం రూ.3,150 నిర్ణయించినట్లు చెప్పారు.
- 10–15 కి.మీ వరకు ట్రాక్టరు ఇసుక (5 టన్నులు) యార్డు వద్ద రూ.775, రవాణా చార్జీ రూ.1,400 మొత్తం రూ.2,175, టిప్పర్ ఇసుక (6 టైర్స్, 10 టన్నులు) యార్డు వద్ద రూ.1,550, రవాణా చార్జీ రూ.1,900 మొత్తం రూ.3,450గా నిర్ణయించారు.
- 15–20 కి.మీ వరకు ట్రాక్టరు ఇసుక (5 టన్నులు) యార్డు వద్ద రూ.775, రవాణా చార్జీ రూ.1,600 మొత్తం రూ.2,375, టిప్పర్ ఇసుక (6 టైర్స్, 10 టన్నులు) యార్డు వద్ద రూ.1,550, రవాణాచార్జీ రూ.2,200 మొత్తం రూ.3,750గా నిర్ణయించారు.
- 20–25 కి.మీ వరకు ట్రాక్టరు ఇసుక (5 టన్నులు) యార్డు వద్ద రూ.775, రవాణా చార్జీ రూ.1800 మొత్తం రూ.2,575, టిప్పర్ ఇసుక (6 టైర్స్, 10 టన్నులు) యార్డు వద్ద రూ.1,550, రవాణాచార్జీ రూ.2,500 మొత్తం రూ.4,050గా నిర్ణయించారు.
- 25–30 కి.మీ. వరకు ట్రాక్టరు ఇసుక (5 టన్నులు) యార్డు వద్ద రూ.775, రవాణాచార్జీ రూ.2,000 మొత్తం రూ.2,775, టిప్పర్ ఇసుక (6 టైర్స్, 10 టన్నులు) యార్డు వద్ద రూ.1,550, రవాణాచార్జీ రూ.2,800 మొత్తం రూ.4,350గా నిర్ణయించారు.

ఎస్ఐలకు స్థాన చలనం

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో 16 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ మణికంఠ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో చిత్తూరు తాలూకా ఎస్ఐ సి.ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎన్ఆర్.పేట ఎస్ఐ కె.వెంకట సుబ్బమ్మ, బైరెడ్డిపల్లె ఎస్ఐ బి.క్రిష్ణయ్యకు పోస్టింగ్ ఇవ్వకుండా వేకెంట్ రిజర్వుకు పంపుతూ ఆదేశాలిచ్చారు. స్థానచలనం పొందిన ఎస్ఐల జాబితా ఇలా ఉంది.

ఎస్ఐ పేరు	పనిచేస్తున్న ప్రాంతం	బదిలీ ప్రాంతం
ఎస్.మల్లికార్జున	బంగారుపాళెం	స్పెషల్ బ్రాంచ్, చిత్తూరు
బి.పరశురాముడు	అనంతపురం	బైరెడ్డిపల్లె
ఎ.చిరంజీవి	ఆర్‌సి.పురం, తిరుపతి	తవణంపల్లె
పి.ధరణీంద్ర	ట్రాన్స్‌కో, తిరుపతి	కాణిపాకం
కె.రామ్మోహన్	కాణిపాకం	గుడిపాల
టి.వెంకటసుబ్బయ్య	తిరుచానూరు	వెదురుకుప్పం
జి.రమేష్‌బాబు	ఐరాల	చిత్తూరు తాలూక
కె.నాగసౌజన్య	చిత్తూరు దిశ	ఎన్ఆర్.పేట
కె.స్వర్ణతేజ	డీసీఆర్‌బీ, చిత్తూరు	పలమనేరు
ఇ.జయప్ప	విజయపురం	బంగారుపాళెం
పి.రాజ్‌కుమార్	సీఐడీ, తిరుపతి	కార్వేటినగరం
కె.సుగుణ	వీఆర్, చిత్తూరు	చిత్తూరు 2 టౌన్
డి.సురేంద్రబాబు	వీఆర్, చిత్తూరు	పీసీఆర్, చిత్తూరు

దేశ ప్రతిష్టను దిగజార్చారు



మాట్లాడుతున్న నారాయణస్వామి

పుత్తూరు : భారతదేశ రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి దేశ ప్రతిష్టను దిగజార్చిందని, ఇది కూటమి ప్రభుత్వ కుట్రేనని మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి తేల్చిచెప్పారు. ఆయన శనివారం పుత్తూరు పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయవాడలో 206 అడుగుల ఎత్తుతో సామాజిక న్యాయ మహా శిల్పాన్ని ఆవిష్కరించారని చెప్పారు. దీనిని ఏమాత్రం జీర్ణించుకోలేకపోయిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే అంబేడ్కర్ విగ్రహం విధ్వంసానికి పాల్పడ్డారని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును ధ్వంసం చేయించారని ఆరోపించారు. శిలాఫలకంపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును చెరిపేయవచ్చని, అయితే ప్రజల గుండెల్లో గూడుకట్టుకొన్న ప్రజాభిమానాన్ని తగ్గించలేరని అన్నారు. చంద్రబాబు చేసిన తప్పుకు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

బాబు పాలన కుట్రలమయం

వి.కోట: రాష్ట్రంలో చంద్రబాబు పాలన కుట్రలు, కుతంత్రాలతో సాగుతోందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మండిపడ్డారు. టీడీపీ నాయకులు విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేయడంపై ఆయన శనివారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ చేశారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ, గతంలో ఏ ముఖ్యమంత్రీ సాహసించని రీతిలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడలో నిర్మించి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. అయితే జగనన్నకు మంచి పేరు వస్తుందన్న అక్కసుతో చంద్రబాబు ఇలా దాడులు చేయి స్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ యువరాజ్, మాజీ ఏఎంసీ చైర్మన్ ప్రహ్లాద, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పీఎస్ నాగరాజు, ఎస్ఏ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



వి.కోట: కొవ్వొత్తుల ప్రదర్శనలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన

చిత్తూరు కార్పొరేషన్: సామాజిక న్యాయ మహాశిల్పంపై దాడి చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు గాయత్రీదేవి పేర్కొన్నారు. ఆమె పార్టీ శ్రేణులతో కలిసి నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సరళా మేరి నాయకులు లక్ష్మణస్వామి, కేపీ శ్రీధర్, మధురెడ్డి, ప్రేమ్, అన్బు పాల్గొన్నారు.



చిత్తూరు: కొవ్వొత్తుల ప్రదర్శనలో మాట్లాడుతున్న గాయత్రీదేవి

క్లుప్తంగా

వాహనం ఢీకొని దుప్పి మృతి



ప్రమాదంలో మృతి చెందిన దుప్పి

గంగవరం: రోడ్డు దాటుతున్న దుప్పిని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఫారెస్ట్ అధికారుల కథనం మేరకు మండలంలో పలమనేరు–బెంగళూరు జాతీయ రహదారిపై మామడుగు క్రాస్ వద్ద రోడ్డు దాటుతున్న నాలుగేళ్ల మగ దుప్పిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన దుప్పి అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న బీట్ ఆఫీసర్ రాధన్న ఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దుప్పికి పోస్టుమార్టం నిర్వహించి దహనం చేశారు.

మానసిక వేదనతో వ్యక్తి ఆత్మహత్య

బైరెడ్డిపల్లె : మానసిక వేదనతో కుంగిపోయిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శనివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు, వి.కోట మండలం ముమ్మురేడుపల్లెకు చెందిన నవనీతతో కుప్పనపల్లెకు చెందిన జగదీష్ ఆచారి (45)తో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరి కాపురం కొంత కాలం సజావుగా కొనసాగింది. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 2017లో భార్యపై అనుమానం వచ్చిన జగదీష్ఆచారి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. నవనీత ఫిర్యాదు మేరకు అప్పటి పోలీసులు కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు. ఆ సమయంలోనే నవనీత పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. జగదీష్ ఆచారి బెయిల్‌పై వచ్చి ఒంటరిగా కుప్పనపల్లిలోనే ఉంటున్నాడు. దీంతో మానసికంగా కుంగిపోయి ఇంటిలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి లోకనాథాచారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

19 నాటు బాంబులు స్వాధీనం

గుడిపాల: అడవి పందుల వేటకు ఉపయోగిస్తున్న 19 నాటుబాంబులను స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు, చిత్తపార గ్రామానికి చెందిన భాస్కర్(42) అటవీ ప్రాంతంలో అడవి పందులను వేటాడేవాడు. ఈ క్రమంలో శనివారం అడవి పందులను చంపేందుకు ఉపయోగించే 19 నాటుబాంబులను స్వాధీనం చేసుకొని, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. సిబ్బంది రామక్రిష్ణ, నవీన్ పాల్గొన్నారు.

భవిష్య నిధి ఏదీ?

గుడిపాలకు చెందిన ఉపాధ్యాయుడు తన తల్లికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో రూ.5 లక్షలు పీఎఫ్ సొమ్ము విత్ డ్రా కోసం దరఖాస్తు చేశాడు. సకాలంలో అందకపోవడంతో ఇంటి పత్రాలు తాకట్టు పెట్టి బ్యాంకులో రుణం తీసుకొని వైద్యం చేయించాడు.

పుంగనూరుకు చెందిన మండల కార్యాలయ ఉద్యోగి, కుమార్తె ఉన్నత విద్య కోసం పీఎఫ్ నగదు విత్ డ్రా కోసం దరఖాస్తు చేసుకున్నారు. నెలలు గడుస్తున్నా ఫలితం లేకపోవడంతో వారి వద్ద ఉన్న బంగారు నగలు బ్యాంకులో తాకట్టు పెట్టారు. వచ్చిన డబ్బులతో చదువుకోసం ఖర్చు చేశారు. ఇది ఒకరిద్దరి సమస్యే కాదు ఉమ్మడి జిల్లాలో జెడ్పీ ఉద్యోగులు పడుతున్న అవస్థలు. పీఎఫ్, ఫైనల్ పేమెంట్స్ లెక్క తేలక తిప్పలు పడుతున్నారు.

- పీఎఫ్ కోసం జెడ్పీ ఉద్యోగుల ఆందోళన బాట
- లెక్క తేలని రూ.16.58 కోట్లు
- అవసరాలకు ఉపయోగపడని పీఎఫ్ సొమ్ములు
- 12న ఆందోళనకు సిద్ధమవుతున్న ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: పేరుకు తగ్గట్లుగానే భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడుతుందని నెలనెలా ఉద్యోగులు తమ జీతాల నుంచి పీఎఫ్ చందాలను జెడ్పీ పీఎఫ్ ఖాతాకు చెల్లిస్తున్నారు. అయితే నిర్వహణ లోపాలు, నిర్లక్ష్యం కారణంగా భవిష్య నిధి ఖాతా అగమ్యగోచరంగా మారిపోయింది. ఎవరి ఖాతాల్లో ఎంత మొత్తాలు ఉన్నాయో తెలుసు



జెడ్పీ కార్యాలయం

కోలేక పీఎఫ్ ఖాతాదారులు లబోదిబోమంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కొంత మొత్తం పొందాలన్నా, పదవీ విరమణ చెందిన వారు తుది మొత్తాలు పొందాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిష్కారం వైపు దృష్టి సారించాల్సిన అధికార యంత్రాంగం నిస్తేజంగా ఉండడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉంది.

పెండింగ్ మొత్తం రూ.16.58 కోట్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో దాదాపు 12,816 మంది ఉద్యోగులు పీఎఫ్ ఖాతాదారులుగా ఉన్నారు. ఈ సంవత్సరం 453 మందికి పీఎఫ్, ఫైనల్ పేమెంట్స్ రూపంలో రూ.16.58 కోట్లు అందాల్సి ఉంది. గత సంవత్సరం 1,744 మందికి రూ.62.92 కోట్లు చెల్లించారు. వీరి జీతాల నుంచి ప్రతినెలా పీఎఫ్ చందా మొత్తం మినహాయించుకుంటున్నారు. ఖజానా శాఖ నుంచి ఈ వివరాలు జిల్లా పరిషత్ కార్యాలయానికి అందాల్సి ఉంది. అయితే జిల్లా పరిషత్, ఖజానా శాఖల మధ్య సమన్వయ లోపం ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పీఎఫ్ ఖాతాదారులు ఇబ్బందుల పాలవుతున్నారు. పీఎఫ్ మొత్తాలు సకాలంలో ఖాతాదారుల వ్యక్తిగత ఖాతాలకు చేరడం లేదు. ఇలాంటి మొత్తాలు కోట్లాది రూపాయలు సస్పెన్స్ ఖాతాల్లో మూలుగుతున్నాయి. వీటికి వడ్డీ రూపేణా వస్తున్న లక్షలాది రూపాయలు ఏమవుతున్నాయో తెలియడం లేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

12న జెడ్పీ ఎదుట ధర్నా

పీఎఫ్ సమస్యలపై పలుమార్లు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వినతి పత్రాలు ఇచ్చినా చేసిన ఫలితం లేదు. దీంతో ఈనెల 12న ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో జెడ్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇది వరకే సమ్మె నోటీసును అధికారులకు అందజేశారు.

పీఎఫ్ సొమ్ము కోసం అగచాట్లు

విచిత్రంగా పీఎఫ్ సొమ్ము పొందడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. తమకు తమ కుటుంబ సభ్యులకు వైద్య చికిత్సలు, కాలేజీ ఫీజులు, ఇంటి మరమ్మతులు తదితర అవసరాల కోసం పీఎఫ్ సొమ్ము కోసం దరఖాస్తు చేస్తుంటారు. దీనికి పలు ఆధారాలతో పాటు పీఎఫ్ స్లిప్పును కూడా జమ చేయాలని జత చేయాలని ఆదేశాలు ఉన్నాయి. అయితే పీఎఫ్ స్లిప్పులు జారీ చేయాల్సిన జిల్లా పరిషత్ అధికారులు ఆ పని చేయడం లేదు. అదేమిటంటే దీనికి సవాలక్ష సాంకేతిక కారణాలను సాకుగా చూపుతున్నారు. అయితే పలు శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న జీపీఎఫ్‌లో ఇలాంటి ఇబ్బందులు లేవు. జీపీఎఫ్ ఖాతాల నిర్వహణకు లేని సమస్యలు జెడ్పీ పీఎఫ్ ఖాతాల నిర్వహణకు ఎందుకు వస్తున్నాయో తెలియడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

“

ఉద్యమిస్తాం



జీపీఎఫ్ లాగా జెడ్పీ పీఎఫ్‌ను కూడా మెరుగ్గా నిర్వహించాలని కోరుతున్నాం. అత్యవసర పరిస్థితుల్లో రుణాలు, పదవీ విరమణ తర్వాత తుది మొత్తాలు పొందలేకపోతున్నాం. పీఎఫ్ స్లిప్పులు అందుబాటులో లేక వేలాదిమంది ఉద్యోగ, ఉపాధ్యాయులు బాధ పడుతున్నారు. వీటికి నిరసనగా 12న జెడ్పీ కార్యాలయం ఎదుట మహా ధర్నా నిర్వహిస్తున్నాం. అవసరమైతే వందలాది మంది చేత స.హ. చట్టం ద్వారా దరఖాస్తు చేయించి పీఎఫ్ మొత్తాల వివరాలను బహిర్గతం చేయిస్తాం.

– గంటా మోహన్,
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

నివేదికను ఇచ్చాం



జెడ్పీ పరిధిలోని ఉద్యోగులకు రావాల్సిన పీఎఫ్, ఫైనల్ పేమెంట్స్ వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం. పీఎఫ్ వెబ్ సైట్ పనిచేయడం లేదు. ఇతర జిల్లాలో మాదిరిగా ప్రైవేటు సాఫ్ట్‌వేర్ విధానం ద్వారా స్లిప్స్ వెబ్‌సైట్‌లో ప్రదర్శన ఉంచడానికి అధికారుల అనుమతి కోరాం. మా కార్యాలయ పరంగా ఎవరి అకౌంట్స్‌ను పెండింగ్‌లో పెట్టలేదు. తమ సమస్యలపై పలువురు ఉద్యోగులు విన్నవించారు. మా పరిధి మేరకు సమస్యలను పై అధికారులకు తెలియజేస్తున్నాం.

– గ్లోరియా, సీఈఓ, జెడ్పీ

13న జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 13న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ శాఖ జిల్లా ఉపాధి అధికారిణి పద్మజ తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, కరూర్ వైశ్యా బ్యాంక్ తదితర సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉన్న నిరుద్యోగులు, విద్యార్హత సర్టిఫికెట్‌లతో జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పెద్దపంజాణి: రెండో పెళ్లి విషయమై జరిగిన గొడవలో ఇరువర్గాలపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ సహదేవి పేర్కొన్నారు. ఆమె కథనం మేరకు వివరాలు, మండలంలోని చిన్నేపల్లెకు చెందిన ఎస్. అజ్జుభా దాదాపు ఐదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన ఆసియాను వివాహం చేసుకున్నాడు. సంతానం లేనందున మొదటి భార్య సమ్మతితో ఏడాది క్రితం కర్ణాటక రాష్ట్రం ముళబాగల్‌కు చెందిన మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. అయితే అజ్జుభా రెండో పెళ్లి చేసుకోవడం ఇష్టం లేని మొదటి భార్య చిన్నాన్న మౌలా, ఆయన ఇద్దరు కుమారులు, కొండేపల్లెకు చెందిన మేనమామలు మహ్మద్, జాఫర్ తదితరులు శుక్రవారం రాత్రి అజ్జుభా, అతని తమ్ముళ్లపై వాగ్వివాదానికి దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాలకు చెందిన వారు గాయపడ్డారు. ఈ మేరకు 10 మందిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీ అయిన నగలు లభ్యం



ప్రత్యేక అలకంరణలో ప్రసన్నాంజనేయస్వామి



స్వామివారి పాదాల చెంత నుంచి నగలు, నగదు అందుకుంటున్న భాను ప్రకాష్ దంపతులు

- ఇంటి గుమ్మం వద్ద ప్రత్యక్షమైన నగలు, నగదు
- రాజనాలబండ ప్రసన్నాంజనేయ స్వామికి మొక్కులు చెల్లింపు

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ ప్రసన్నాంజనేయ స్వామి మహిమతోనే చోరీ అయిన నగలు, నగదు లభ్యమయ్యాయని బాధితుడు కర్ణాటకలోని కొత్తమంగళానికి చెందిన బాల సుబ్రమణ్యం దంపతులు తెలిపారు. వారు శనివారం రాజనాల బండకు చేరుకొని స్వామివారి పాధాల చెంత నగలు, నగదు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. వారి కథనం మేరకు, కర్ణాటక రాష్ట్రం ముళబాగిల్ తాలూకా కొత్తమంగళంకు చెందిన బాల సుబ్రమణ్యం ఇంట్లో ఇరవై రోజుల క్రితం చోరీ అయింది. ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు బీరువాలోని 40 గ్రాముల నగలు, రూ.25 వేలు నగదు చోరీ చేశారు. గుర్తించిన యజమానులు చుట్టుపక్కల వారిని విచారించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చశారు. పెద్దమనుషులచే పంచాయతీ పెట్టి రాజనాల బండలో ప్రమాణం చేయాలని తీర్మానించారు. గత శనివారం రాజనాల బండకు చేరుకొని ముందుగానే ఈ నెల 2వ తేదీ ప్రమాణం చేయడానికి కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేసి వారి గ్రామానికి వెళ్లి విషయాన్ని గ్రామపెద్దలకు వివరించారు. ఈ నెల 10వ తేదీ శనివారం ఉదయం ఇంటికో మనిషి రాజనాల బండకు ప్రమాణం చేయడానికి బయలు దేరాలని చాటింపు వేశారు. సరిగ్గి ఉదయం ఇంటి ఆవరణలో నగలు, నగదు ప్రత్యక్షమయ్యాయి. గుర్తించిన బాధితులు పెద్దమనుషులకు నగల విషయాన్ని తెలిపి కుటుంబ సభ్యులతో ఆలయం వద్దకు చేరుకొని పూజలు చేశారు. స్వామి మహిమతోనే పోయిన నగలు తిరిగి వచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు. నగలను టెంపుల్ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్, అర్చకుడు కృష్ణమూర్తి, గ్రామస్తులు వెంకటరెడ్డి, ఈశ్వరయ్య కలిసి అందజేశారు.

తొలి శ్రావణ శనివారపు పూజలు

శ్రావణమాసం శనివారానికి పురస్కరించుకొని ఆలయంలో స్వామివారికి మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అభిషేక పూజలు, అర్చనలు చేపట్టారు. ఈ నెల చివరి శనివారం, ఆదివారం రోజున వేడుకగా తిరుణాళ్లు నిర్వహించనున్నారు.

దుకాణంలో పట్టుచీరల చోరీ

పలమనేరు: పట్టపగలే వస్త్ర దుకాణంలో పట్టు చీరలు చోరీకి గురైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానిక ఎద్దులసంత వీధిలో ఉండే బాబు క్లాత్‌స్టోర్‌లో మధ్యాహ్నం భోజనం సమయంలో కొనుగోలుకు వచ్చిన ఐదుగురు మహిళలు వ్యాపారం చేస్తూ 10 పట్టు చీరలను చోరీ చేశారు. ఆపై దుకాణానికి వచ్చిన యజమాని ఈ విషయాన్ని గుర్తించి సీసీ కెమెరాను పరిశీలించగా ఈ విషయం బయటపడింది. దీనిపై ఆయన స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఇద్దరు మద్యం విక్రేతల అరెస్టు

బంగారుపాళెం: మండలంలో వేర్వేరు గ్రామాల్లో శనివారం అక్రమంగా కర్ణాటక, ఆంధ్ర మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని సదకుప్పం గ్రామంలో ధనంజయనాయుడు ఇంటి వద్ద మద్యం విక్రయిస్తుండగా హెడ్‌కానిస్టేబుల్ బాబు, సిబ్బంది పట్టుకున్నారు. అతని వద్ద 20 మద్యం టెట్రా ప్యాకెట్లు, బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముద్దాయిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మండలంలోని వేపనపల్లెలో సుజాత ఆంధ్ర మద్యం విక్రయిస్తుండగా ఏఎస్ఐ మల్లప్ప, సిబ్బంది పట్టుకుని ఆమె వద్ద 18 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఆమెను అరెస్టు చేసినట్లు వివరించారు.

హోరాహోరీగా ‘చాంపియన్‌షిప్’



షూటింగ్ బాల్ పోటీల్లో హోరాహోరీగా పోటీ పడుతున్న క్రీడాకారులు

వి.కోట: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఏపీ అంతర జిల్లా షూటింగ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలను పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు మనోధైర్యంతో పాటూ శారీరక దృఢత్వం పెంపొందుతుందని తెలిపారు. ఈ పోటీలకు అండర్ 14 విభాగం నుంచి ఏపీలోని 16 జిల్లాల నుంచి బాలుర, బాలికల జట్లు హాజరైనట్లు తెలిపారు.

బాలికపై లైంగిక వేధింపులు

చిత్తూరు అర్బన్: పొట్టకూటి కోసం వేరే దేశానికి వెళుతూ.. తన కుమార్తెను చూసుకోమని స్నేహితురాలికి అప్పగించిన పాపానికి చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న తల్లి తన స్నేహితురాలు ఆమె భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. చిత్తూరు టూ టౌన్ సీఐ వలసయ్య కథనం మేరకు, చెన్నైకు చెందిన మహిళ కొంతకాలంగా చిత్తూరులో ఉంటుంది. ఇటీవల ఆమె ఉద్యోగం కోసం దుబాయ్ వెళుతూ తన ఆరేళ్ల కుమార్తెను చిత్తూరులోని కాజూరుకు చెందిన తన స్నేహితురాలు పవిత్రకు అప్పగించి వెళ్లింది. మూడు నెలలుగా బాలిక తన తల్లితో ఫోన్లో మాట్లాడుతూ తనను ఇక్కడ కొడుతున్నారంటూ చెప్పింది. చెన్నైలో ఉన్న తన బంధువులను పంపించి, పాపను చెన్నైలో ఉంచుకోవాలని కోరింది. బాలిక శరీరంపై గాయాలు ఉండడంతో చెన్నైలోని ఆమె బంధువులు వైద్యుడి దగ్గరికి తీసుకెళ్లారు. బాలికను పరిశీలించిన వైద్యుడు ఈమెపై లైంగిక దాడి జరిగిన విషయాన్ని చెప్పాడు. దుబాయ్ నుంచి చెన్నైకి వచ్చిన బాలిక తల్లి, పాపతో మాట్లాడితే పవిత్ర ఆమె భర్త సతీష్ ఇద్దరూ కలిసి నిత్యం లైంగిక దాడికి పాల్పడేవారని చెప్పింది. శనివారం చిత్తూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.